క్లుప్తంగా

నేడు 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ '

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం గణపతినగర్‌లో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించను న్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయ ప్రసాద్ పాల్గొంటారని వార్డు అధ్యక్షురాలు దొడ్డి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని... వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

ప్రైవేటు క్యాంటీన్ల తొలగింపు ప్రారంభం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటు క్యాంటీన్ల తొలగింపు ప్రక్రియ ప్రారంభమైంది.ఉక్కు మంత్రిత్వశాఖ ఉత్తర్వుల మేరకు షాపులను తక్షణం మూసి వేసి ప్లాంట్ ప్రాంగణం వదలి వెళ్లాలని ఆయా షాపుల యజమానులకు నోటీసులు జారీ చేశారు. స్టీల్‌ప్లాంట్‌లో ప్రైవేటు క్యాంటీన్లు, పాన్‌షాపులు, జ్యూస్ షాపులు సుమారు 70 ఉన్నట్టు యాజమాన్యం గుర్తించింది. అదే విధంగా గతంలో క్యాంటీన్ నిర్వహించి ప్రస్తుతం మూతపడినవి సుమారు 20 ఉన్నాయి. మొదటి దశలో మూతపడిన క్యాంటీన్ల షెడ్ల తొలగింపు పనులు గురువారం సాయంత్రం ప్రారంభించారు.ఇవి పూర్తయిన తర్వాత ప్రస్తుతం నడుస్తున్న క్యాంటీన్లపై యాజమాన్యం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

వృద్ధుడి అదృశ్యం


పోలయ్య (ఫైల్)

గోపాలపట్నం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు అదృశ్యమైన ఘటనపై ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్‌లో కేసునమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. జీవీఎంసీ 57వ వార్డు సాకేతపురానికి చెందిన ముగడ పోలయ్య(70)ఈ నెల 3న ఉదయం 8 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా రాక పోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించక పోవడంతో ఎయిర్‌పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు.ఎవరైనా గుర్తిస్తే 7989072635 నంబర్‌కు సమాచారమివ్వాలని ఎయిర్‌పోర్టు పోలీసులు కోరారు.

వివాహితకు ఆశ్రయం



వివాహితను షెల్టర్ నిర్వాహకుడు ప్రగడ వాసుకు అప్పగిస్తున్న కానిస్టేబుల్ గాయత్రి

అల్లిపురం: కాకినాడకు చెందిన వివాహిత వాసపల్లి జ్యోతిశ్రీ (27) భర్త హింస భరించలేక ఇల్లు వదిలి విశాఖ చేరుకుంది. ఆమెకు ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. భర్త రోజూ కొడుతుండడంతో ఇల్లు వదిలి పుట్టింటికి వెళ్లింది. ఆమె తల్లిదండ్రులు ఆమెకు నచ్చజెప్పి తిరిగి అత్తవారి ఇంటికి పంపించారు. అయితే అత్తగారే చాడీలు చెబుతూ, కొడుకుతో కలిసి చిత్ర హింసలు పెడుతుండటంతో ఆమె తట్టుకోలేక ఇల్లు వదిలి విశాఖ వచ్చేసింది. ఒంటరిగా మహారాణి పేట రోడ్ల మీద తిరుగుతూ ఉండగా లేడీ కానిస్టేబుల్ గాయత్రి ఆమెను చూసి వివరాలు తెలుసుకుంది. ఆమెను టీఎస్ఆర్ కాంప్లెక్స్‌లోని షెల్టర్‌కు తీసుకెళ్లింది. ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు సమక్షంలో జీవీఎంసీ మహిళల వసతి గృహంలో ఆమెకు ఆశ్రయం కల్పించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉత్సాహంగా ఏయూ ఉద్యోగుల క్రికెట్ పోటీలు


సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న సీఏవో జట్టు

మద్దిలపాలెం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రా యూనివర్సిటీ ఉద్యోగులకు శుక్రవారం ఏయూ గ్రౌండ్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభించారు. మొత్తం 10 జట్లు పాల్గొన్నాయి. తొలి రోజు నాలుగు జట్ల మధ్య పోటీలు ఉత్సాహభరితంగా జరిగాయి. సీఏవో-1 జట్టు సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ఆ టీం ప్లేయర్ గోవింద అత్యధికంగా 44 పరుగులు సాధించారు. శనివారం జరిగే పోటీల్లో 6 జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లకు ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్లు వెంకటాద్రి, సిద్ధయ్య హాజరు కానున్నారు. పోటీల నిర్వాహకులుగా దువ్వి గోవింద, డి.శ్రీనివాసరావు, కోనా పోలారావు, కర్రి శ్రీనివాస్ వ్యవహరించారు. ఖాదర్ బాబా, ఈశ్వరరావులు ఆసక్తికరమైన వ్యాఖ్యానంతో మ్యాచ్‌లను రక్తికట్టించారు.

బాలారిష్టాలు

- అసౌకర్యాల నడుమ బాల్యంబడుల నిర్వహణ
- జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ శూన్యం
- ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం
- బుచ్చిరాజుపాలెం స్కూల్ మూసివేతకు సిద్ధం


బడిలోకి వెళ్లకుండా అడ్డంగా మట్టికుప్పలు


అధ్వానంగా బుచ్చిరాజుపాలెంలోని బాల్యం బడి


జీవీఎంసీ 52వ వార్డు కరాసలోని బాల్యం బడి


పిల్లలు లేరు... విధుల్లో ఆయా

విశాఖ విద్య: మురికివాడల్లో పిల్లల సంరక్షకోసం నిర్వహిస్తున్న 'బాల్యం బడి'కి ఇంకా బాలారిష్టాలు వీడలేదు. బాలలు బడి మొహం చూడడం లేదు. జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వీటి గురించి విద్య, ఐసీడీఎస్ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదు. బాల్యం బడుల పర్యవేక్షణ కోసం జీవీఎంసీలో ప్రత్యేక విభాగం ఉంది. కానీ సదరు అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ లేకపోవడంతో వీటి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది.

లక్ష్యం ఇదీ

మూడు నుంచి ఆరేళ్ల మధ్య చిన్నారులకు ఆటపాటలతో విద్య అందించి వారిని బడిబాట పట్టించాలనేది బాల్యం బడి కేంద్రాల లక్ష్యం. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ఇదే వయస్సు వారికి విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలో ప్రీ స్కూళ్లు నిర్వహిస్తున్నారు. అయితే నగరంలోని మురికివాడల్లో పేద కుటుంబాల్లోని పిల్లల కోసం ప్రత్యేకంగా జీవీఎంసీ ఆధ్వర్యంలో బాల్యం బడులను నిర్వహిస్తున్నారు. చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించేలా ప్రతీ కేంద్రంలో టీచర్‌తో పాటు ఆయాను ఏర్పాటు చేశారు. కేంద్రాల పర్యవేక్షణ కోసం జీవీఎంసీలో ఓ ప్రాజెక్టు అధికారి, నలుగురు సూపర్‌వైజర్లు పనిచేస్తున్నారు. కానీ వీటిపై సరైన పర్యవేక్షణ లేకపోవడంతో లక్ష్యం నీరుగారిపోతుంది.

చిన్నారులకు అందని పౌష్టికాహారం

బాల్యం బడికి వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం అందడం లేదు. 3 నుంచి 6 ఏళ్ల మధ్య చిన్నారులు అంగన్‌వాడీలకు వెళితే ఎంచక్కా ఉడికబెట్టిన గుడ్లు, పాలు, పౌష్టికాహారం ఇస్తున్నారు. కానీ బాల్యం బడికి వచ్చే పిల్లలకు మాత్రం మధ్యాహ్న భోజనం కూడా పక్కనే ఉన్న జీవీఎంసీ స్కూళ్ల హెచ్‌ఎంల దయాదాక్షిణ్యాలపై ఆధారపడక తప్పడం లేదు. ఇలాంటి పరిస్థితులను చూసిన చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలను బాల్యం బడి నుంచి తీసుకుపోయి సమీపాన ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పిస్తున్నారు. దీంతో బాల్యం బడులు పిల్లలు లేక బోసిపోతున్నాయి.

ఐసీడీఎస్‌కు అప్పగిస్తే ..

బాల్యం బడుల్లోని చిన్నారులను సమీపాన ఐసీడీఎస్‌కు అప్పగించాలని జీవీఎంసీ గత పాలక వర్గం ఆలోచన చేసింది. ఇక్కడ పనిచేసే సిబ్బంది(టీచర్,ఆయా)ని జీవీఎంసీ స్కూళ్లకు అప్పగించటమో.. లేదంటే ఇతర పనులకు వినియోగించుకోవాలని భావించారు. కానీ కూటమి ప్రభుత్వంలోని ప్రస్తుత పాలక వర్గ పెద్దలు బాల్యం బడుల బాగు కోసం ఆలోచన చేయడం లేదని తల్లిదండ్రులు అంటున్నారు. నగరంలో జీవీఎంసీ పరిధిలో 37 వరకు బాల్యం బడులు ఉండగా, వీటిలో సుమారుగా 800 మంది వరకు చిన్నారులు ఉన్నట్లు తెలుస్తోంది. వీరందరినీ ఐసీడీఎస్ ఆధ్వర్యంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు అప్పగిస్తే చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం అందుతుందని, ఆ దిశగా జీవీఎంసీ ఉన్నతాధికారుల ఆలోచన చేయాలని పలువురు కోరుతున్నారు.


చిన్నారికి మెటీరియల్ అందజేస్తున్న ఎంఈవో దివాకర్ (ఫైల్)

ఇదిగో సాక్ష్యం

జీవీఎంసీ 90వ వార్డు ఎస్ఎస్‌టీఎల్ ఫ్యామిలీ **గేటు ఎదురుగా నిర్వహిస్తున్న** బాల్యం బడిలో ఒక్కరు కూడా చేరలేదు. ప్రతీ రోజూ ఇక్కడ ఆయా మాత్రం విధులకు హాజరౌరావు రోజంతా బడి తెరిచి కాపలా కాస్తోంది. రెండు నెలలుగా ఇదే తంతు కొనసాగుతోందని చుట్టుపక్కల వారు అంటున్నారు. బడిలోకి వెళ్లే అవకాశం లేకుండాపైపులైను పనులు చేసే కాంట్రాక్టర్ మట్టికుప్పలు వేయించాడు. నిర్వహణ సరిగా లేకపోవడంతో బడి బూత్ బంగ్లా మాదిరి కనిపిస్తోంది. జీవీఎంసీ అధికారుల పర్యవేక్షణ లేమికి ఇదో నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోంది. బుచ్చిరాజుపాలెం కేంద్రాన్ని మూసేస్తారనే ప్రచారం కూడా సాగుతోంది.

బ్రహ్మకుమారీస్ కేంద్రం ప్రారంభం


కార్పొరేటర్ వెంకటరమేష్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీలు

గోపాలపట్నం:జీవీఎంసీ 89వ వార్డు నాగేంద్ర కాలనీలో బ్రహ్మకుమారీస్ రాజయోగ మెడిటేషన్ సెంటర్‌ను శుక్రవారం ఆ వార్డు కార్పొరేటర్ దాడి వెంకట రమేష్ ప్రారంభించారు. మెడిటేషన్ సెటర్ ఈ ప్రాంతంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు ఆయనకు రాఖీకట్టారు. కార్యక్రమంలో శరగడం సురేష్, బొడ్డేటి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఈఎల్ పునరుద్ధరించాలని వినతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అర్జిత సెలవులు (ఈఎల్) ఎన్‌క్యాష్‌మెంట్ సౌకర్యాన్ని పునరుద్ధరించరించాలని స్టీల్ సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఎండీకి వినతి పత్రం అందజేశారు. ఈఎల్ పై ఆధారపడి పిల్లల ఫీజులు చెల్లించుకునే వారని పేర్కొన్నారు. ఉద్యోగుల పరిస్థితి అర్థం చేసుకుని లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ పునరుద్ధరించాలన్నారు. అధికారులకు 300 లీవులు పొదుపు చేసుకునే అవకాశం ఉండగా కార్మికులకు 200 లీవులు మాత్రమే పొదుపు చేసుకునే అవకాశం ఉందన్నారు. కార్మికులు లీవులు కోల్పోకుండా అధికారుల వలే 300 లీవులు పొదుపు చేసుకునే అవకాశం కల్పించాలని యూనియన్ గౌరవాధ్యక్షులు జె. అయోధ్యరామ్, అధ్యక్షులు వై.టి. దాస్, ప్రధానకార్యదర్శి యు. రామస్వామి కోరారు.

పరిశుభ్రతతో వ్యాధులకు చెక్


ఫ్రైడే-డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింహాచలం: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులకు చెక్ పెట్టవచ్చునని మలేరియా నివారణ విభాగం ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ అన్నారు. జీవీఎంసీ 62వ వార్డులో శుక్రవారం డ్రైడేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైడే-ఫ్రైడేపై ప్రతి ఒక్కరూ అవగాహన ఏర్పరుచుకుని ప్రతి శుక్రవారం, మంగళవారం ఇంట్లో అత్యవసరానికి కావాల్సిన నీటిని ఉంచుకుని, మిగిలిన పాత్రలను ఖాళీ చేయాలని సూచించారు. వ్యర్థాలను తడి-పొడి చెత్తగా ఇంటి వద్దే వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. దోమల నియంత్రణ కోసం శ్రమిస్తున్న అధికార యంత్రాంగానికి ప్రజలంతా సహకరించాలని కోరారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వైద్యులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో 62వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం, సూపర్‌వైజర్ దుల్లా శ్రీనివాసరావు, శానిటరీ సూపర్‌వైజర్ గంట్యాడ గోవింద్, జీవీఎంసీ సిబ్బంది, సచివాలయ సిబ్బందిపాల్గొన్నారు.

సోదరభావానికి ప్రతీక రక్షాబంధన్


రాఖీలు తయారు చేస్తున్న బాలికలు

కంచరపాలెం: రక్షాబంధన్ వేడుకను పురస్కరించుకుని గొల్లకంచరపాలెంలో రాధికా ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం చిన్నారులకు రాఖీల తయారీలో శిక్షణ ఇచ్చారు. సహజ సిద్ధంగా దొరికే సామగ్రితో రాఖీలు తయారు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆత్మీయతకు చిహ్నం అయిన రాఖీ పండగ విశిష్టతను తెలిపేందుకు శిక్షణ ఇస్తున్నట్లు ట్రస్టు సభ్యులు నమ్మి జోత్యిబాబు తెలిపారు. మహాలక్ష్మి, మాన్విత, జశ్వంత్, ఎస్.తేజ, పి.లావణ్యలక్ష్మి, సాద్విక్, నిఖిల తదితరులు పాల్గొన్నారు.

డాక్‌యార్డ్ కేటీబీ నూతన కార్యవర్గ ఎన్నిక


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

విశాఖ విద్య: డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా గంట్ల శ్రీనుబాబు, అధ్యక్ష, కార్యదర్శులుగా బత్తుల చిరంజీవి, విజనగిరి భాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విరోతి వెంకటేష్, అడిషనల్ జనరల్ సెక్రటరీగా యాతము రాజ్ కుమార్, కోశాధికారిగా గనిరెడ్డి శ్రీనివాస్‌తో కలిపి మొత్తం 27 మంది నూతన కార్యవర్గంలో ఎన్నికయ్యారు. సంఘ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షతన ఎన్ఏడీ సమీపంలోని కాకానినగర్‌లోని సంఘ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం తొలిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు శ్రీనుబాబు,అధ్యక్షుడు బత్తుల చిరంజీవి మాట్లాడుతూ రక్షణ రంగంలో సేవ చేసే అవకాశం లభించడం ప్రతి ఒక్కరూ పూర్వ జన్మసుకృతంగా భావించాలన్నారు. అందరి సహకారంతో కేటీబీ కళాక్షేత్రాన్ని నిర్మించి అందుబాటులోకి తెచ్చుకోగలిగామన్నారు. అధికారుల, ఉద్యోగుల సంక్షేమానికి (సభ్యుల) తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం పలు తీర్మానాలు చేసింది. మూడేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది. పలువురి సీనియర్లను సలహాదారులుగా, కొందరు న్యాయవాదులను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. నూతన కార్యవర్గానికి సభ్యులంతా అభినందనలు తెలియజేశారు.

మర్యాదపూర్వక కలయిక


గణేష్‌మిశ్రాను సత్కరిస్తున్న మళ్ల విజయప్రసాద్

సింహాచలం: రాష్ట్ర ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల(వైఎస్సార్‌సీపీ) విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన గణేష్‌మిశ్రా శనివారం 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావుతో కలిసి మాజీ ఎమ్మెల్యే, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి పదవి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మళ్ల విజయప్రసాద్ గణేష్‌మిశ్రాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు, 40వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పూటుగా మద్యం తాగి వ్యక్తి మృతి

ఎంవీపీకాలనీ: అధికంగా మద్యం తాగి ఓ వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం మద్దిలపాలెంలో జరిగింది. ఎంవీపీ పీఎస్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. గోపాలకృష్ణ(55) అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో కలిసి మద్దిలపాలెంలో నివసిస్తున్నాడు. తన దగ్గరి బంధువుల ఇంట్లో ఫంక్షన్ కావడంతో శుక్రవారం ఉదయం నుంచి పూటుగా మద్యం తాగాడు. మధ్యాహ్నం అదే ప్రాంతంలో ఫుట్‌పాత్‌పై మరణించి ఉండటంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు గుర్తు తెలియని వ్యక్తిగా భావించి మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అనంతరం విషయం కుటుంబ సభ్యులకు తెలియడంతో కేజీహెచ్‌కు వెళ్లి పోలీసులను సంప్రదించగా.. మృతదేహాన్ని వారికి అప్పగించారు.

రైలు ప్రమాదంలో గాయపడిన విష్ణుయాదవ్ డిశ్చార్జి


రోగిని పరామర్శిస్తున్న డాక్టర్ రాధాకృష్ణన్

మహారాణిపేట: కదులుతున్న రైలు నుంచి ప్రమాదశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డ విష్ణుయాదవ్ (26)ను వైద్య సేవలు అందించి శుక్రవారం కేజీహెచ్ వైద్యులు డిశ్చార్జి చేశారు. గత నెల 27న కరకవలస వద్ద కదులుతున్న రైలు నుంచి విష్ణుయాదవ్ జారి పడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో అతని ఎడమ చేయి భుజం వరకు తెగి శరీరం నుంచి వేరు పడింది. స్పృహ లేని స్థితిలో ఉన్న యాదవ్‌ను కేజీహెచ్ అత్యవసర విభాగంలో చేర్పించారు. షాక్ నుంచి కోలుకోవడానికి వైద్య సేవలు అందించి, అనంతరం రక్తం ఎక్కించి శస్త్ర చికిత్స నిర్వహించారు. మత్తు, ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాలు సంయుక్తంగా శస్త్ర చికిత్స చేసి రోగి త్వరగా కోలుకునే విధంగా వైద్య సేవలు అందించారు. శుక్రవారం కేజీహెచ్ డిప్యూటీ సూపరిండెంటెండ్ డాక్టర్ రాధాకృష్ణన్ రోగిని పరామర్శించారు. విష్ణుయాదవ్ ఆరోగ్యంగా ఉండడంతో శుక్రవారం డిశ్చార్జి చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. రోగి, వారి బంధువులు వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు.

అప్పన్నకు ఘనంగా నిత్య కల్యాణం


తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి శుక్రవారం నిత్య కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

మార్కెట్‌కు రాఖీ శోభ


విభిన్న ఆకృతుల్లో రాఖీలు


రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు

విశాఖవిద్య: కాలం మారినా... దూరం పెరిగినా.. అన్నా చెల్లెళ్ల అనుబంధం ఎన్నటికీ మధురమే. అన్నా చెల్లెలు, అక్కా-తమ్ముళ్ల అనురాగాలకు ఆప్యాయతలకు ప్రతీక రాఖీ పండగ. జీవితంలో తనకు ఎల్లవేళలా రక్షగా ఉండాలని, సాధకబాధల్లో తోడుగా నిలవాలని అక్క చెల్లెలు అన్నదమ్ములకు రాఖీ కట్టడం ఆనవాయితీగా వస్తోంది. తనకు అండగా నిలిచే సోదరుడు మహోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ అక్కా చెల్లెమ్మలు ఎంతో ప్రేమతో రాఖీ కడుతుంటారు. సోదరి కట్టిన రక్షా బంధనాన్ని స్వీకరించిన అన్న తానెప్పుడూ చెల్లెలికి రక్షగా ఉంటానని ఈ పండగ వేళ ప్రతినబూనుతాడు. ఈ నేపథ్యంలోనే శనివారం రాకీ పండగను జరుపుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. సోదరుడికి రాఖీ కట్టేందుకు అక్క చెల్లెమ్మలు అందమైన రాఖీల వేటలో పడ్డారు. రాఖీల విక్రయాల దుకాణాల్లో శుక్రవారం కొనుగోళ్ల సందడి కనిపించింది. మిఠాయి దుకాణాల్లోనూ జోరుగా సీట్లు విక్రయాలు జరిగాయి. సాకేంతికత పుంతలు తొక్కుతున్న నేటి రోజుల్లో వాట్సప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టా, షేర్ చాట్‌లలో శుభాకాంక్షలు కాకుండా అనుబంధాలకు ప్రతీకగా నిలిచే ఈ పండగను అంతా కలిసి జరుపుకోవాల్సిన అవసరం ఉందని పెద్దలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


రాఖీలు కొనుగోలు చేస్తున్న మహిళలు


స్వీట్ షాపులో రద్దీ

ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్‌కు ముఖం చాటు!

- స్టాండ్‌లోకి రాని ఆటోలు
- అధిక భారంతో ప్రయాణికుల విలవిల


ఖాళీగా దర్శనమిస్తున్న ప్రీపెయిడ్ ఆటోస్టాండ్

అగనంపూడి: ప్రీ పెయిడ్ ఆటో స్టాండ్‌కు ముగింపు పలికేందుకు ఆటో డ్రైవర్లు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగో నంబర్ ప్లాట్‌ఫారం వైపు పది రోజుల కిందటే ప్రీ పెయిడ్ ఆటో, ట్యాక్సీ స్టాండ్‌ను డీఆర్ఎం లలిత్ బొహ్రా, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించిన విషయం తెలిసిందే. ప్రయాణికుల భద్రతతో పాటు ధరలు అందుబాటులో ఉంచేందుకు ఆటో స్టాండ్‌ను ప్రారంభించారు. అప్పట్లో 70మంది ఆటోవాలాలు ప్రీపెయిడ్ ఆటో స్టాండ్‌లో నమోదు చేసుకున్నారు. కిలోమీటర్లను అనుసరించి పోలీసులు ధరలు నిర్ణయించారు. ఆ మేరకు ఆటోలు నడిపితే డ్రైవర్లు ఆశించిన డబ్బులు రావని భావించిన ఆటోవాలాలు స్టాండ్‌లో కాకుండా ఆరుబైట ఆటోలు నిలిపేస్తున్నారు. అధికారిక ఆటో స్టాండ్‌లోఆటోలు నిలపడం మానేశారు. నేరుగా స్టేషన్ ఆవరణకు వెళ్లిపోయి ప్రయాణికులతో మాట్లాడుకొని వారు నిర్ణయించిన రేటు ప్రకారం ప్రయాణికులను తీసుకువెళ్తున్నారు. దీంతో ప్రయాణికులకు మేలు చేయాలని భావించి తాము చేసిన పోరాటం మూణ్నాళ్ల ముచ్చటగా మారే పరిస్థితి ఉందని దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వాపోతున్నారు. రైల్వేస్టేషన్ ముఖ ద్వారం వద్దకు వెళ్లి ప్రీ పెయిడ్ ఆటోస్టాండ్ ఉందని, అక్కడికి వెళ్తే తక్కువ ధరకు భద్రంగా గమ్యస్థానాలకు వెళ్లవచ్చని యూనియన్ నాయకులు చెబుతున్నారు.దీంతో ప్రయాణికులు తీరా అక్కడికి వెళ్లాక ఆటోలు అందుబాటులో లేక పోవడంతో పోలీస్ కంట్రోల్ సిబ్బంది కూడా చేతులు ఎత్తేస్తున్నారు.

ధరలు ఇలా ..

పోలీసులు నిర్ణయించిన ధర ప్రకారం ఉక్కు నగరానికి రూ.90 చెల్లించాలి. కానీ ఆటో డ్రైవర్లు ఇప్పటి వరకు రూ.200 నుంచి రూ.250 వరకు వసూలు చేస్తున్నారు. అదే రాత్రి తొమ్మిది దాటితే డ్రైవర్లు అడిగినంత చెల్లించుకోవాల్సిందే. ఆ రేట్లకు అలవాటు పడిన డ్రైవర్లు ససేమేరా అంటుండడంతో ప్రయాణికులకు భారం తప్పడం లేదు.

ముగిసిన బ్యాడ్మింటన్ పోటీలు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

పెదగంట్యాడ: క్రీడలు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆంధ్రప్రదేశ్ బ్యాడ్మింటన్ అసోసియేషన్, శాప్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు వికాస్‌నగర్‌లోని రాజీవ్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాల బాలికల అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తిని చాటుకోవాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద్, కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, బొడ్డు నర్సింహపాత్రుడు పాల్గొన్నారు.